


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




శనివారం 07-03-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 268 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ఎస్సీ వర్గీకరణతో తెలంగాణకు

# ప్రత్యేక గుర్తింపు

- ఉద్యోగులు దీక్షలా పని చేయాలి
- పేదల కోసం 99 రోజుల ప్రగతి ప్రణాళిక
- చివరి పేదవాడి వరకు సంక్షేమం చేరాలి
- ప్రభుత్వానికి కళ్లు చెవులు ఉద్యోగులే
- దళితుల హక్కుల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ప్రజా పాలనప్రగతి ప్రణాళికను దీక్షగా చేయండి
- ఒక్క రోజు నిర్లక్ష్యం.. పది కుటుంబాలకు నష్టం

\- సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రంలోని అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఉద్యోగులు ఒక దీక్షగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 99 రోజుల కార్యాచరణను సమర్థంగా అమలు చేస్తే పేదలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు జరుగుతుందని ఆయన తెలిపారు.


2 లో

## ప్రతిపక్షం తన బాధ్యతను

# విస్మరించింది

: మంత్రి పయ్యావుల కేశవ్


2 లో

అమరావతి: ఏపీ శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రసంగిస్తూ ప్రతిపక్షం తన బాధ్యతను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. సభలో ప్రతిపక్షం లేకపోవడం బాధాకరమని, తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడే అవకాశం కోసం ఎదురు చూసేవాళ్లమని గుర్తుచేశారు.

## UPSC ఫలితాలు విడుదల..

### అనుజ్ అగ్రిహోత్రికి ఫస్ట్ ర్యాంక్..



2 లో

## గచ్చిబౌలిలో పేలిన హీలియం గ్యాస్ బెలూన్


2 లో

# అప్పులపై తప్పుడు లెక్కలు

**అప్పులపై అసెంబ్లీ సాక్షిగా తప్పుడు లెక్కలు..!**
**కాకి లెక్కలు, అబద్ధపు కూతలు.. : పేర్ని నాని**


2 లో

రాష్ట్ర అప్పుల విషయంలో ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా తప్పుడు లెక్కలు చెబుతోందని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని ఆరోపించారు. గత ఏడాది సుమారు రూ.1.03 లక్షల కోట్ల అప్పు చేసిన ప్రభుత్వం, ఈ ఏడాది రూ.97 వేల కోట్ల అప్పు తీసుకుంటామని బడ్జెట్‌లో పేర్కొన్నప్పటికీ వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని ఆయన విమర్శించారు. కార్పొరేషన్ల ద్వారా తీసుకుంటున్న అప్పులను బడ్జెట్‌లో చూపడం లేదని అన్నారు.

రాష్ట్రానికి ఆదాయాలు తగ్గుతున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని ప్రభుత్వం చెప్పడం సరైంది కాదని పేర్ని నాని పేర్కొన్నారు.

## ప్రజా పాలనప్రగతి ప్రణాళిక

# డైవర్షన్ ప్లాన్


2 లో

- పాలన వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు కాంగ్రెస్ డైవర్షన్ ప్లాన్
- 800 రోజుల పాలనలో చేసిందేం లేదని విమర్శ
- ప్రజాపాలన దరఖాస్తులు చెత్తబుట్టల్లోనే ఉన్నాయన్న ఆరోపణ
- రైతులకు భరోసా, బోనస్ ఇవ్వలేదని మండిపాటు
- ఉద్యోగాల విషయంలో యువతను మోసం చేశారని హరీష్‌రావు విమర్శ

## యుద్ధం వేళ భారత్‌కు

# గుడ్‌న్యూస్..

రష్యా చమురు కొనుగోలుకు అమెరికా అనుమతి


2 లో

## 13 ఏళ్ల లోపు వారికి

# సోషల్ మీడియా బ్యాన్

- ఏపీలో 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం
- చిన్నారుల కోసం ఏపీ సర్కార్ కీలక నిర్ణయం
- 90 రోజుల్లో సోషల్ మీడియా బ్యాన్ అమలు సీఎం
- పిల్లల భవిష్యత్తు కోసం సోషల్ మీడియాపై ఆంక్షలు
- 13-16 ఏళ్ల వారిపైనా పరిమితులపై ఏపీ సర్కార్ ఆలోచన

మారుతున్న సాంకేతిక యుగంలో పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా ముందడుగు వేసింది. 13 ఏళ్లలోపు చిన్నారులు సోషల్ మీడియా వినియోగాన్ని పూర్తిగా నిషేధించే ప్రతిపాదనపై ప్రభుత్వం పని చేస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని వెల్లడించారు.

సోషల్ మీడియా వినియోగం వల్ల పిల్లలపై పడుతున్న ప్రతికూల ప్రభావాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం తెలిపారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేసిన సూచనల మేరకు ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించినట్లు చెప్పారు. రాబోయే 90 రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

అదేవిధంగా 13 నుంచి 16 ఏళ్ల వయసు గల పిల్లలపై కూడా సోషల్ మీడియా వినియోగానికి పరిమితులు విధించాలా అనే అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ విషయంపై నిపుణుల అభిప్రాయాలు సేకరించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సీఎం తెలిపారు.

మిగతా 2లో...



## లైకుల కోసం ప్రాణాలు

# పణంగా పెట్టొద్దు

- రైలు స్టంట్ చేస్తూ యువకుడి మృతి.. సోషల్ మీడియా స్టంట్లపై సీపీ సజ్జనార్ ఆందోళన
- వైరల్ కావాలనే స్టంట్లు వద్దు.. యువతకు సీపీ సజ్జనార్ కీలక సూచనలు


2 లో

## లోక్‌సభ స్పీకర్‌పై

# అవిశ్వాస తీర్మానం..

ఎంపీలకు విప్ జారీచేసిన బీజేపీ, కాంగ్రెస్


2 లో

## శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ సర్కిల్‌లో

# ఏసీబీ సోదాలు

- టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటరీ విభాగాల్లో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు
- అధికారులను విచారించిన అధికారులు.. కీలక పత్రాలు స్వాధీనం



2 లో

## రాజీనామా చేసి

# ఇంట్లో కూర్చోండి..

రోజా ఫైర్


2 లో

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మాట్లాడిన ఆమె, రాజకీయాల్లో ఉన్న నాయకులు ప్రజలకు మంచి చేయాలని, అది చేయలేకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని సూచించారు.

దేవుడిని రాజకీయాల్లోకి లాగకూడదని ఇప్పటికే పలుమార్లు చెప్పినా కొందరు నాయకులు అదే విధంగా మాట్లాడుతున్నారని రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ నివేదికలో జంతు కొవ్వు కలిసిందన్న ఆరోపణలు అసత్యమని ఆమె పేర్కొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం


## ఎస్సీ వర్గీకరణతో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు: సీఎం

మొదటి పేజీ తరువాయి

ఉద్యోగులు బాధ్యతతో వ్యవహరిస్తే చివరి పేదవాడి వరకు సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. ఒక్క రోజు నిర్లక్ష్యం వల్ల పది దళిత కుటుంబాలకు న్యాయం జరగకుండా పోవచ్చని హెచ్చరించారు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు, బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని సీఎం అన్నారు.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సందర్భంగా మాదిగ ఉద్యోగుల కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, వెనుకబడిన బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. వచ్చే అంబేద్కర్ జయంతి నాటికి మాదిగల ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం దశాబ్దాలుగా పోరాటం సాగిందని, ఈ అంశాన్ని గత 20 ఏళ్లుగా దగ్గరగా పరిశీలించానని సీఎం తెలిపారు. రాజకీయ ఒత్తిడులు ఉన్నప్పటికీ మాదిగలకు అండగా నిలబడ్డానని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ఆయన చెప్పారు.

ప్రతి నెల వెయ్యి మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారని, వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌గా నెలకు సుమారు వెయ్యి కోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని సీఎం తెలిపారు. పరిమిత ఆర్థిక పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతోందన్నారు. అక్రమాలను అరికట్టి ఖజానాకు నిధులు సమకూర్చడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

దళితుల అభివృద్ధికి విద్య అత్యంత ముఖ్యమని, విద్య ద్వారా మాత్రమే జీవితాల్లో మార్పు సాధ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే విద్యా శాఖను ప్రక్షాళన చేస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## లైకుల కోసం ప్రాణాలు పణంగా పెట్టొద్దు

### : సీపీ సజ్జనార్

హైదరాబాద్: సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం ప్రాణాలను పణంగా పెట్టే ప్రమాదకరమైన స్టంట్లకు దూరంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ యువతకు సూచించారు. కదులుతున్న రైలు నుంచి వేలాడుతూ రీల్ చిత్రీకరిస్తుండగా స్తంభానికి ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటనపై స్పందించిన ఆయన, ఆ వీడియోను 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్టు చేస్తూ యువతకు హెచ్చరిక జారీ చేశారు.

సోషల్ మీడియాలో వైరల్ కావాలనే ఉద్దేశంతో యువత ప్రమాదకరమైన విన్యాసాలు చేయడం తీవ్ర ఆందోళనకరమని సజ్జనార్ అన్నారు. నడుస్తున్న రైలుకు వేలాడుతూ వీడియోలు తీయడం అత్యంత ప్రమాదకరమని, ఇలాంటి చర్యలు ప్రాణాలను కోల్పోయే పరిస్థితులకు దారితీస్తాయని పేర్కొన్నారు.

లైకులు, వ్యూస్ కోసం ప్రాణాలను ప్రమాదంలో పెట్టకూడదని, ఒక్కసారి ఇంట్లో ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలని యువతకు సీపీ సూచించారు. ప్రమాదకరమైన స్టంట్లు చేయడం వల్ల తిరిగి రాని నష్టం జరుగుతుందని హెచ్చరించారు.

## UPSC ఫలితాలు విడుదల..

### అనుజ్ అగ్రిహోత్రికి ఫస్ట్ ర్యాంక్..

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2025 శుక్రవారం విడుదలయ్యాయి. అనుజ్ అగ్నిహోత్రి ఫస్ట్ ర్యాంక్ సాధించారు. మొత్తం 958 మంది అభ్యర్థులు IAS, IFS, IPS మరియు ఇతర పోస్టులకు అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ upsc.gov.in లేదా upsconline.gov.inలో రోల్ నంబర్ వారీగా ఫలితాన్ని తనిఖీ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**టాపర్లు వీరే..**

ఈ ఏడాది అనుజ్ అగ్నిహోత్రి సివిల్ సర్వీసెస్ పరీక్షలో మొదటి స్థానంలో నిలిచారు, తరువాత రాజేశ్వరి సువే రెండవ స్థానంలో, ఆకాంక్ష్ మూడవ స్థానంలో, రాఘవ్ ఝున్‌ఝున్‌వాలా నాల్గవ స్థానంలో, ఇషాన్ భట్నాగర్ ఐదవ స్థానంలో నిలిచారు. ఈ ఏడాది అర్హత సాధించిన 958 మందిలో 317 మంది జనరల్ కేటగిరీకి చెందినవారు కాగా, 104 మంది EWS, 3306 మంది ఓబీసీ , 158 మంది ఎస్సి, 73 మంది ఎస్టీ కేటగిరీకి చెందినవారు ఉన్నారు.

ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి 15 రోజుల్లోపు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని యూపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. రాతపరీక్ష ఆగస్టు, 2025లో జరిగింది. పర్సనాలిటీ టెస్ట్‌లు డిసెంబర్ 2025, ఫిబ్రవరి 2026 మధ్య జరిగింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల ఎంపికకు సివిల్ సర్వీసెస్ పరీక్షలు ప్రతీ ఏడాది యూపీఎస్సీ ద్వారా ప్రిలిమినరీ, మెయిన్, ఇంటర్వ్యూ అనే మూడు దశల్లో నిర్వహిస్తారు.

## 13 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియా ప్రభావంతో చిన్నారులు మానసిక ఒత్తిడికి గురవడం, డిజిటల్ మోసాలకు బలవడం, అనుచితమైన కంటెంట్ ప్రభావానికి లోనవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లల భవిష్యత్తు దెబ్బతినకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు.

ఈ నిర్ణయం అమలులోకి వస్తే, పిల్లల కోసం సోషల్ మీడియా వినియోగంపై ఆంక్షలు విధించిన దేశంలోని తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచే అవకాశముంది.

## ప్రజా పాలనప్రగతి ప్రణాళిక డైవర్షన్ ప్లాన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలనప్రగతి ప్రణాళికపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని డైవర్షన్ ప్లాన్‌గా చేపట్టిందని ఆయన ఆరోపించారు. 800 రోజుల పాలనలో సాధించినదేమీ లేకపోవడంతో ఇప్పుడు 99 రోజుల ప్రణాళిక పేరిట మరో డ్రామాకు తెరతీసిందని విమర్శించారు.

గతంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు ఇప్పటికీ పరిష్కారం కాక పెండింగ్‌లోనే ఉన్నాయని హరీష్‌రావు పేర్కొన్నారు. ఆ సమస్యలకు పరిష్కారం చూపకుండా మళ్లీ పది వారాల కార్యక్రమాలతో ప్రజలను మోసం చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని అన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆయన విమర్శించారు. పంట సీజన్ ముగిసినా రైతు భరోసా అందలేదని, గత సీజన్ పంట బోనస్ కూడా ఇవ్వలేదని అన్నారు. యూరియా సరఫరా చేయడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

యువతకు ఉద్యోగాల విషయంలో కూడా ప్రభుత్వం మోసం చేసిందని హరీష్‌రావు పేర్కొన్నారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు జాబ్ క్యాలెండర్‌ను 'జాబ్‌లెస్ క్యాలెండర్'గా మార్చారని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం వంటి పథకాల కింద తీసుకున్న దరఖాస్తులు కూడా పరిష్కారం కాకుండా పోయాయని అన్నారు.

సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలను కేవలం ప్రచారం కోసం మాత్రమే ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రచార కార్యక్రమాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలు గమనిస్తున్నారని, గ్రామ గ్రామాన ప్రజలు దీనిపై ప్రశ్నించేందుకు సిద్ధంగా ఉన్నారని హరీష్‌రావు హెచ్చరించారు.

## గచ్చిబౌలిలో పేలిన హీలియం గ్యాస్ బెలూన్



నగరంలోని గచ్చిబౌలిలో హీలియం గ్యాస్ బెలూన్ పేలి నలుగురికి గాయాలయ్యాయి. బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ప్రాంగణంలో అడ్వర్టైజ్‌మెంట్ గ్యాస్ బెలూన్ పేలింది. ఓ కన్వెన్షన్ లో హోలీ ఈవెంట్ లో అడ్వర్టైజ్మెంట్ కోసం బెలూన్ ఏర్పాటు చేశారు. అయితే అది గాలికి ఎగిరి వచ్చి బ్రహ్మకుమారీస్ ప్రాంగణంలో పడింది. దీన్ని బ్రహ్మకుమారీస్ వాలంటరీలు తీయడానికి ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా పేలింది,. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే ఉస్మాన్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ప్రతిపక్షం తన బాధ్యతను విస్మరించింది

### : మంత్రి పయ్యావుల కేశవ్

మొదటి పేజీ తరువాయి



బడ్జెట్ డిమాండ్లపై సభ్యులంతా చురుకుగా చర్చలో పాల్గొన్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా వివిధ శాఖల డిమాండ్లపై మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మూలధన వ్యయాన్ని రూ.24 వేల కోట్ల నుంచి రూ.53,915 కోట్లకు పెంచామని, దీని వల్ల మౌలిక వసతులు మెరుగుపడి ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుందని అన్నారు.

పాలన అంటే కేవలం బటన్లు నొక్కడం కాదని, ప్రజలు తమ కాళ్లపై నిలబడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

రాయలసీమ ప్రాజెక్టులను ఆపేశామని వైసీపీ చేస్తున్న ఆరోపణలు అసత్యమని మంత్రి ఖండించారు. ప్రాంతీయ అసమానతలకు తావులేకుండా బడ్జెట్ రూపొందించామని ఆయన స్పష్టం చేశారు.

## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం..



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం తీసుకురానున్న నేపథ్యంలో పార్లమెంట్‌లో ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్మానంపై వచ్చే వారం లోక్‌సభలో చర్చ జరగనుండగా, బీజేపీ మరియు కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. చర్చ మరియు ఓటింగ్ సమయంలో ప్రతి ఎంపీ సభలో తప్పనిసరిగా హాజరవ్వాలని ఆదేశించాయి.

స్పీకర్ ఓం బిర్లా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ గత నెలలోనే ప్రతిపక్షాలకు చెందిన 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారు. అయితే సభలో నెలకొన్న గందరగోళం కారణంగా సమావేశాలు వాయిదా పడడంతో ఈ ప్రక్రియ ఆలస్యమైంది.

ఈ నెల 9, 10 తేదీల్లో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగి, అనంతరం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బీజేపీ తమ ఎంపీలు ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేయాలని సూచించగా, కాంగ్రెస్ కూడా తమ సభ్యులు సభలో ఉండాలని ఆదేశించింది.

కేంద్ర బడ్జెట్ రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభమవుతాయి. ఈ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్నాయి. అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యే వరకు స్పీకర్ చైర్‌లో ఓం బిర్లానే కొనసాగుతారు. చర్చ సమయంలో ఆయన సాధారణ ఎంపీగా సభలో పాల్గొని తన వాదనలు వినిపించే అవకాశం కూడా ఉంటుంది.

## యుద్ధం వేళ భారత్‌కు గుడ్‌న్యూస్..

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేస్తుండగా.. ఇంకోవైపు ప్రతీకారంగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్, అమెరికా మద్దతు గల గల్ఫ్ దేశాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఇంకోవైపు హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో ప్రపంచ దేశాలకు చమురు సమస్య తలెత్తింది.

ఈ నేపథ్యంలో రష్యా దగ్గర నుంచి చమురు కొనుగోలు చేసుకునేందుకు భారతదేశానికి అమెరికా నుంచి 30 రోజులు అనుమతి లభించింది. ఈ మేరకు అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ వెల్లడించారు. సముద్రంలో చిక్కుకుపోయి ఉన్న రష్యా నౌకల నుంచి మాత్రమే కొనుగోళ్లు జరగాలని స్పష్టంచేశారు. దీంతో ఆ దేశానికి ఆర్థికపరంగా పెద్దగా ప్రయోజనం చేకూరదని తెలిపారు. అమెరికాకు భారత్ ముఖ్యమైన భాగస్వామి అని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తమ ముడి చమురు కొనుగోళ్లను భారత్ పెంచుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## అప్పులపై తప్పుడు లెక్కలు


రాష్ట్ర అప్పుల విషయంలో ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా తప్పుడు లెక్కలు చెబుతోందని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని ఆరోపించారు. గత ఏడాది సుమారు రూ.1.03 లక్షల కోట్ల అప్పు చేసిన ప్రభుత్వం, ఈ ఏడాది రూ.97 వేల కోట్ల అప్పు తీసుకుంటామని బడ్జెట్‌లో పేర్కొన్నప్పటికీ వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని ఆయన విమర్శించారు. కార్పొరేషన్ల ద్వారా తీసుకుంటున్న అప్పులను బడ్జెట్‌లో చూపడం లేదని అన్నారు.

రాష్ట్రానికి ఆదాయాలు తగ్గుతున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని ప్రభుత్వం చెప్పడం సరైంది కాదని పేర్ని నాని పేర్కొన్నారు. రెండు నెలల్లోనే రూ.57 వేల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పడం వాస్తవానికి దూరమని విమర్శించారు.

అలాగే సీఎం చంద్రబాబు నివసిస్తున్న కరకట్ట ఇల్లు ఎవరిదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. టాటా మోటార్స్‌కు భూముల కేటాయింపు, గీతం యూనివర్సిటీ భూముల అంశాలపై కూడా ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ఆరోపించారు.

తిరుమల లడ్డూ వ్యవహారంలో కూడా ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని పేర్ని నాని విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ, సూపర్ సిక్స్ హామీలు కూడా అమలు కాలేదని, ప్రభుత్వం నిజాలను దాచిపెడుతోందని ఆయన ఆరోపించారు.

## శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ సర్కిల్‌లో ఏసీబీ సోదాలు




శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటరీ విభాగాలు సహా వివిధ శాఖల అధికారులను విచారించి పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ప్రాథమిక దర్యాప్తులో కొన్ని అక్రమాలు జరిగినట్లు గుర్తించినట్టు అధికారులు తెలిపారు.

వివరాల్లోకి వెళితే.. శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఈ ఆకస్మిక తనిఖీలపై రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వివరాలు వెల్లడించారు. సర్కిల్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటరీ శాఖలతో పాటు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న అధికారులను ఏసీబీ అధికారులు విచారించినట్లు చెప్పారు. ప్రాథమిక దర్యాప్తులో కొన్ని చిన్నపాటి అక్రమాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు.అయితే తనిఖీల సమయంలో ఎటువంటి నగదు లభించలేదని, పలు ముఖ్యమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు.

## రాజీనామా చేసి ఇంట్లో కూర్చోండి..




మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత వంటి ఉన్నత స్థానాల్లో ఉన్న నాయకులు కూడా దిగజారి మాట్లాడుతున్నారని రోజా విమర్శించారు. ప్రజలు ఈ విషయాలను గమనిస్తున్నారని ఆమె అన్నారు. శాసన మండలి చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తి కులం, మతం గురించి మాట్లాడటం చాలా దిగజారిన చర్య అని ఆమె అభిప్రాయపడ్డారు.

ఉన్నత పదవుల్లో ఉన్నవారు కులం, మతం చూడకుండా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు బాధ్యతాయుతంగా మాట్లాడాలని, కానీ ఆయన ఎప్పుడైనా అలాంటి విధంగా మాట్లాడారా అని రోజా ప్రశ్నించారు.

రాష్ట్రంలోని ప్రసిద్ధ ఆలయాల ప్రతిష్ఠను దెబ్బతీయేలా కూటమి నేతలు మాట్లాడుతున్నారని రోజా ఆరోపించారు. ముఖ్యంగా తిరుమల, శ్రీశైలం, అన్నవరం వంటి పవిత్ర క్షేత్రాల పేరును రాజకీయాలకు ఉపయోగించడం సరైంది కాదన్నారు. లడ్డూ వ్యవహారంలో తాము తప్పు చేయలేదని భావిస్తే చర్చకు రావాలని ఆమె సవాల్ విసిరారు.

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను, దేవాలయాల ప్రసాదాన్ని ఉపయోగించి భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దని రోజా సూచించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం ఇస్తారని ఆమె వ్యాఖ్యానించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
www.edikadanijam.com

# ఆత్మనిర్భర్- వికసిత్ భారత్ సంకల్పంపై చేసిన తీర్మానానికి శాసనసభ ఆమోదం

అమరావతి మార్చి 6(ఇది కద నిజం ): సామాజిక మాధ్యమాల కారణంగా 13 ఏళ్ల లోపు పిల్లలు నష్టపోకుండా నిషేధించే అంశాన్ని పరిశీలిస్తున్నామని త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికి సంబంధించి 90 రోజుల్లో విధి విధానాలు ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చల విడితనంపై మంత్రి నారా లోకేష్ లోకేశ్ అధ్యయనం చేసి కొన్ని సిఫార్సులు చేశారని సీఎం అన్నారు. శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. గత పాలకుల అస్తవ్యస్త విధానాల కారణంగా సంక్షోభంలో పడిన రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని ఆయన అన్నారు. వివిధ అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'గత పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి గడచిన 20 నెలల్లో కష్టాలు, సమస్యల్ని అధిగమించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి సంక్షేమం వైపుగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. 15 రోజుల పాటు జరిగిన శాసనసభలో ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తు గురించి చర్చలు జరిగాయి. భావితరాల భవిష్యత్ నిర్ణయించేలా ఈ సమావేశాల్లో చర్చలు, నిర్ణయాలు జరిగాయి. విభజన వల్ల, గత పాలకుల విధ్వంసం వల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో కీలకమైన నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు చేస్తున్నాం. గత ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థుల్లో 94 శాతం మంది గెలవటం మా అందరిపై ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఎన్డీఏ పక్షాలన్నీ పూర్తి సఖ్యతతో ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

ప్రజలు ఓటేస్తేనే అధికారం..ప్రతిపక్షం

'తీవ్ర అగమ్య గోచరంగా మారిపోయిన రాష్ట్ర భవిష్యత్తును తిరిగి నిర్మించేలా, గట్టెక్కించే బాధ్యత తీసుకున్నాం. రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టాం. ఎన్డీఏ పార్టీలన్నీ పూర్తి సమన్వయంతో వెళ్ల బట్టే అనుకున్నది సాధించగలిగాం. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ శాసన సభకు రాకుండా తప్పించుకు తిరుగుతోంది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసనసభకు వస్తామని చెప్పటం ఏమిటి.? ప్రజలు ఓట్లు వేస్తేనే అధికారం, ప్రతిపక్ష హోదా వస్తాయి. ఈ నిబంధనలన్నీ రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నాయి. ఇవన్నీ తెలియకుండానే రాజకీయం చేస్తున్నారు. గత పాలనలో అన్ని వ్యవస్థలూ ధ్వంసం అయ్యాయి. అలాంటి పరిస్థితిని చక్కదిద్ది గాడిన పెట్టాం. 92 కేంద్ర ప్రాయోజిత పథకాలను నిర్వీర్యం చేశారు. కేంద్రం నిధులు దారి మళ్లించారు. ఒక్క జల జీవన్ మిషన్‌లోనే రూ.85 వేల కోట్లు రావాల్సి ఉంటే కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదనలు పెట్టారు. ఆ పథకానికి 5 ఏళ్లలో చేసిన ఖర్చు కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. మేం అధికారంలోకి వచ్చాక పథకం సమయాన్ని పొడిగించాలని కోరాం. ఇంటింటికీ కుళాయి ఇచ్చేలా ఈ జల్ జీవన్ మిషన్‌ను ప్రణాళిక చేశాం. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అభినందిస్తున్నాను.' అని ముఖ్యమంత్రి తెలిపారు.



అధిక వడ్డీలకు ప్రభుత్వ ఆస్తులు తాకట్టు ప్రజాధనం దుర్వినియోగం

'ప్రజలకు మెరుగైన సుపరిపాలన ఇచ్చేందుకు నిరంతరం పోరాటం చేశాం. గత పాలకులు ప్రభుత్వ ఆస్తులు కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఎమ్మార్వో ఆఫీసు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సర్క్యూట్ హౌస్ లాంటి ఆస్తులను తాకట్టు పెట్టారు. 12, 13 శాతంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రభుత్వ ఆర్థిక వనరుల్ని దుర్వినియోగం చేశారు. రూ.43,298 కోట్ల విలువైన అప్పులకు ప్రభుత్వం రీ షెడ్యూలు చేయించాం. తద్వారా రూ.328 కోట్ల మేర ఆదా అవుతుంది. మరో రూ.1 లక్ష కోట్ల మేర అప్పులు కూడా రీ షెడ్యూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దీని వల్ల రూ.1,658 కోట్ల వెసులుబాటు వస్తుంది. ఈ నిధులతో మరో సంక్షేమ పథకాన్ని అమలు చేసే అవకాశం ఉంటుంది. ఒక వ్యక్తి తన స్వార్థంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేసేశారు. గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేసి నీళ్లు ఇస్తాం. కేంద్ర సహకారంతో అమరావతి రాజధానిని ట్రాక్‌లో పెట్టాం. మూడేళ్లలో రాజధానికి ఓ రూపు వస్తుంది. వచ్చే సమావేశాలకు ఎమ్మెల్యేలు, మంత్రులు రాజధానిలోని వారి క్వార్టర్లలో ఉండేలా చర్యలు చేపడుతున్నాం. కేంద్ర నిధులతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. తొలిసారి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చింది. స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తోంది' అని ముఖ్యమంత్రి తెలిపారు.

గత పాలనలో ట్రూ అప్.. కూటమి వచ్చాక ట్రూడౌన్

'రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత ముఖ్యమైన అంశం. 20 నెలల్లో దీనికి అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. హంద్రీనీవాకు రూ.3850 కోట్లు ఖర్చు చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. అనంతపురం లాంటి జిల్లాకు 55 టీఎంసీల నీటిని తీసుకువెళ్లాం. ప్రస్తుతం వేసవి వచ్చినా 628 టీఎంసీల నీరు వివిధ రిజర్వాయర్లలో నిల్వ ఉంది. సమర్థ నీటి నిర్వహణతోనే ఇది సాధ్యమైంది. భూగర్భజలాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో 2.96 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగేలా వివిధ సంరక్షణా చర్యలు చేపట్టాం. భూగర్భ జలాలు పెరగటం వల్ల వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది. ఆ మేరకు వ్యయాన్ని ఆదా చేసుకున్నాం. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కరెంటు ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. గత పాలకులు రూ.32 వేల కోట్ల కరెంటు ఛార్జీల భారం ప్రజలపై మోపారు. ట్రూ అప్ భారం వేస్తే చరిత్రలో తొలిసారి మేం ట్రూడౌన్ చేశాం. రూ.4420 కోట్ల మేర ట్రూ అప్ భారాన్ని ప్రజలపై మోపకుండా చర్యలు తీసుకున్నాం. పీఎం సూర్యఘర్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర ప్యానెళ్లు ఏర్పాటు చేసి ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. యూనిట్ కొనుగోలు ధరను రూ. 5.19 నుంచి 4.80కు తగ్గించేలా చర్యలు చేపట్టాం. అగ్రిటెక్‌తో వ్యవసాయ రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. రూ.1 లక్ష కోట్లతో ఉమ్మడి ప్రకాశం సహా రాయలసీమ జిల్లాలను హార్టీ కల్చర్ హబ్‌గా పూర్వోదయ పథకం కింద అభివృద్ధి చేస్తాం' అని సీఎం తెలిపారు.

ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు

'ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు ఇవ్వాలనే పది సూత్రాలతో 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశాం. ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. త్వరలోనే ప్రతీ కుటుంబానికి ఫ్యామిలి బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టం కార్డును కూడా జారీ చేస్తాం. కేంద్రం, రాష్ట్రం అందించే పథకాలన్నిటినీ ఈ కార్డు ద్వారా ఇంటిగ్రేట్ చేస్తాం. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంది. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. సర్క్యులర్ ఎకానమీతో వ్యర్థాల ద్వారా సంపద సృష్టిస్తున్నాం. ఇటీవలే వివాదాల పరిష్కారించేలా మధ్యవర్తిత్వంపై ఓ సదస్సు జరిగింది. మధ్యవర్తిత్వంపై దృష్టి పెట్టాలని సూచనలు వచ్చాయి. వివాదం పరిష్కారం అయితే రూ.10 వేల ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించాం. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేసి అవినీతిని కట్టడి చేశాం. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను రద్దు చేస్తున్నాం అవసరమైన మార్పులు చేస్తున్నాం. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపింది. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు మాత్రమే వేశారు

## రామంతపూర్ వెంకటసాయి నగర్ కాలనీ
# ఎన్నికల షెడ్యూల్ ప్రకటింపు





ఇది కద నిజం :రామంతపూర్ పరిధిలోని వెంకట సాయి నగర్ కాలనీలో ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం బీరప్ప దేవాలయంలో కాలనీ ఎన్నికల నిర్వహణపై కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాలనీ ఎన్నికల షెడ్యూల్‌ను కమిటీ సభ్యులు ప్రకటించారు. కమిటీ నిర్ణయం ప్రకారం నామినేషన్ దాఖలు తేదీ 15 మార్చి 2026 (ఆదివారం)గా నిర్ణయించారు. నామినేషన్ల ఉపసంహరణ 18 మార్చి 2026 (బుధవారం). కాలనీ ఎన్నికలు 22 మార్చి 2026 (ఆదివారం) జరగనున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు డిపాజిట్‌గా రూ.25,000గా నిర్ణయించారు.

అలాగే ఎన్నికల్లో విజయం సాధించిన వ్యక్తి 15 రోజులలోపు కాలనీ కమిటీని పునర్వ్యవస్థీకరించాలి (రెన్యువల్ చేయాలి) అని సమావేశంలో ముఖ్య నిర్ణయం తీసుకున్నారు. ఓపెన్ ప్లాట్లు కలిగిన వారికి ఓటు హక్కు ఉండదని ఎన్నికల కమిటీ స్పష్టం చేసింది. కాలనీ అభివృద్ధి దృష్ట్యా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# ప్రపంచాన్ని వణికిస్తున్న ఎపిస్టీన్ ఫైల్స్

వాషింగ్టన్(ఇది కద నిజం ) : మరోసారి 'ఎపిస్టీన్ ఫైల్స్' సంచలనం సృష్టిస్తున్నాయి. వివాదాస్పద వ్యాపారవేత్త జెఫ్రీ ఎపిస్టీన్ సెక్స్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన రహస్య పత్రాలు బహిర్గతం కావడంతో, అందులో ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు ఉండటం అంతర్జాతీయంగా పెను చర్చకు దారితీసింది. వేల పేజీలతో కూడిన ఈ కోర్టు డాక్యుమెంట్లు బయటకు రావడంతో అమెరికా రాజకీయాల్లో ఒక్కసారిగా ప్రకంపనలు మొదలయ్యాయి. గతంలో ఎపిస్టీన్‌తో ట్రంప్‌కు ఉన్న పరిచయాలు, విమాన ప్రయాణాలు మరియు పార్టీల వివరాలు ఇప్పుడు పబ్లిక్ డొమైన్‌లోకి రావడంతో వైట్ హౌస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.



కీలకమైన పేర్లు – షాకింగ్ వివరాలు:

కోర్టు ఆదేశాల మేరకు విడుదలైన ఈ ఫైల్స్‌లో కేవలం ట్రంప్ మాత్రమే కాకుండా, గతంలో అధ్యక్షులుగా చేసిన వారు, బ్రిటన్ రాజకుటుంబీకులు మరియు గ్లోబల్ టెక్ జెయింట్స్ పేర్లు కూడా ఉన్నాయి. ఎపిస్టీన్ నిర్వహించిన ప్రైవేట్ దీవులకు వీరంతా వెళ్ళేవారనే ఆరోపణలు ఇప్పుడు నిజమని తేలుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ తరచుగా ఎపిస్టీన్‌తో కలిసి విమానాల్లో ప్రయాణించారని, ఆయన క్లబ్‌లలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారని ఈ పత్రాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని, అది కేవలం సామాజిక పరిచయం మాత్రమేనని ట్రంప్ వర్గం వాదిస్తోంది.

పొలిటికల్ డైవర్షన్ – వార్ క్లౌడ్స్:

మరోవైపు, ఈ ఎపిస్టీన్ ఫైల్స్ నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికే వెస్ట్ ఏషియాలో యుద్ధ వాతావరణాన్ని ప్రోత్సహిస్తున్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పవర్ ఫుల్ ఎలైట్స్ తమ తప్పులను దాచుకోవడానికి గ్లోబల్ క్రైసిస్‌ను సృష్టిస్తున్నారని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ హయాంలో జరుగుతున్న ఈ పరిణామాలను డెమొక్రాట్లు ఆయుధంగా మార్చుకుంటున్నారు. విచారణను వేగవంతం చేయాలని, బాధ్యులైన ఎంతటి పెద్ద వ్యక్తినైనా శిక్షించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన:

ఈ స్కాండల్ కేవలం అమెరికాకే పరిమితం కాకుండా, గ్లోబల్ మీడియాను షేక్ చేస్తోంది. పవర్ ఫుల్ పీపుల్ ఒక చీకటి నెట్‌వర్క్ ద్వారా సామాన్యులను ఎలా ప్రభావితం చేస్తారో ఈ ఫైల్స్ బయటపెడుతున్నాయి. మీడియాను, ఫారిన్ పాలసీలను తమ గుప్పిట్లో పెట్టుకున్న ఈ ఎలైట్ గ్రూప్, తమ ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ఏ స్థాయికైనా వెళ్తారని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ ఫైల్స్ వల్ల మరిన్ని సంచలన నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉండటంతో ప్రపంచం మొత్తం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

# రోజుకో గంట వెచ్చిస్తే.. ఆరోగ్యం మీ వెంటే: మంత్రి జూపల్లి



ఇది కద నిజం : ఎంత బిజీగా ఉన్నా రోజుకో గంట వెచ్చిస్తూ నడక, వ్యాయామం చేయగలిగితే ఆరోగ్యంగా ఉండొచ్చని రోగాలు దరిచేరే అవకాశం తక్కువని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజలకు సూచించారు. మంత్రి జూపల్లి శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. తొలుత నెరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం ప్రారంభించారు. ఆ తర్వాత కలెక్టరేట్ సమావేశ మందిరానికి చేరుకుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లకు 99 రోజుల పాటు కొనసాగే 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమ అమలుపై దిశానిర్దేశం చేశారు.

సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వారం రోజుల్లో ఆయా సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించి అందజేయాలని ఆదేశించారు. సమీక్షలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌తో పాటు ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, వెద్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ తదితరులు పాల్గొన్నారు.

# లడ్డూ అపవిత్రంపై మండలిలో రగడ

అమరావతి(ఇది కద నిజం ) : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అంశం ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో మరోసారి తీవ్ర దుమారం రేపింది. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఈ వ్యవహారంపై చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను కలకలం సృష్టించాయి. దీనిపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రభుత్వం తరపున ఘాటుగా స్పందిస్తూ ఒక కీలక ప్రకటన చేశారు. గత ప్రభుత్వ హయాంలో అపవిత్రమైన పనులు జరిగాయని ఆధారాలతో సహా తేలిందని, దీనిపై విచారణ కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు.




వైవీ సుబ్బారెడ్డి 'హాట్' కామెంట్స్.. ధీటుగా స్పందించిన మంత్రి ఆనం!

తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి నాణ్యతపై వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సెగలు పుట్టిస్తున్నాయి. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలు కేవలం రాజకీయ కుట్ర అని, భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసేందుకు కూటమి ప్రభుత్వం అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఘాటుగా విమర్శించారు. "శ్రీవారి ప్రసాదంపై ఇటువంటి నీచమైన ఆరోపణలు చేయడం దారుణం. గత ఐదేళ్లలో నెయ్యి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగలేదు. కావాలంటే నేను ప్రమాణానికైనా సిద్ధం" అంటూ వైవీ సుబ్బారెడ్డి చేసిన సవాల్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. తమ హయాంలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీలను తామే బ్లాక్ లిస్ట్‌లో పెట్టామని ఆయన గుర్తు చేశారు.

వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలు – వివాదం:

శ్రీవారి లడ్డూ ప్రసాదంపై వస్తున్న ఆరోపణలను తోసిపుచ్చుతూ వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని అధికార పక్షం మండిపడింది. లడ్డూ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని ఆయన వాదించడాన్ని మంత్రి ఆనం తీవ్రంగా ఖండించారు. నివేదికలు స్పష్టంగా జంతువుల కొవ్వు ఆనవాళ్లు ఉన్నాయని చెబుతుంటే, బాధ్యత గల పదవిలో ఉన్న వ్యక్తులు ఇలా మాట్లాడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో గత పాలకులు ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు.

మండలిలో మంత్రి ఆనం స్పష్టీకరణ:

శాసనమండలిలో ఈ అంశంపై ప్రకటన చేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం తిరుమల ప్రక్షాళనకు నడుం బిగించిందని మంత్రి ఆనం తెలిపారు. "కోట్లాది మంది భక్తుల నమ్మకం లడ్డూ ప్రసాదం. అక్కడ వ్యాపార ధోరణితో వ్యవహరించి, తక్కువ ధరకు వచ్చే కల్తీ నెయ్యిని సేకరించడం వల్లనే ఈ విపత్తు సంభవించింది. దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే ప్రత్యేక విచారణ బృందాలు వాస్తవాలను వెలికితీస్తున్నాయని సభకు వివరించారు.

ఆధ్యాత్మికతకు పెద్దపీట:

ప్రస్తుత ప్రభుత్వం టీటీడీలో రాజకీయ జోక్యాన్ని తగ్గించి, ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తోందని ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. నెయ్యి నాణ్యతను పరీక్షించడానికి అత్యాధునిక ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్తులో ఇలాంటి అపచారాలు జరగకుండా కఠిన చట్టాలు తెస్తామని హామీ ఇచ్చారు. పవిత్రమైన పుణ్యక్షేత్రంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారు భక్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

## ఢిల్లీలో రైసినా డైలాగ్ 2026 సదస్సుకు
# సీఎం చంద్రబాబు

అమరావతి,(ఇది కద నిజం ): దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం హాజరుకానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో సాంకేతికత – సుపరిపాలన, భవిష్యత్ అంశాలపై సీఎం కీలక ఉపన్యాసం చేయనున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ– అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తున్నాయి.




ఉదయం 10.50 గంటలకు సీఎం విజయవాడ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మద్యాహ్నం 2 గంటలకు తాజ్ ప్యాలెస్ లో జరిగే రైసినా డైలాగ్ 2026 సదస్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం ఆయన అమరావతి తిరిగి రానున్నారు. 2016 నుంచి ఎంఓఈఏ– ఓఆర్ఎఫ్ సంస్థలు రైసినా డైలాగ్ పేరిట ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి.

ప్రపంచ రాజకీయాలు– అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ స్థాయిలో చర్చించే అత్యున్నత వేదికగా రైసినా డైలాగ్ సదస్సుకు మంచి పేరుంది. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు, నిపుణులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించేలా ఈ సదస్సు జరగనుంది. అంతర్జాతీయంగా పేరొందిన మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్సు లాంటి ప్రతిష్టాత్మక వేదికల సరసన రైసినా డైలాగ్ నిలుస్తోంది. ఈ ఏడాది జరగనున్న 11వ ఎడిషన్ రైసినా డైలాగ్ సదస్సు సంస్కార– అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు.

ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ రైసినా డైలాగ్ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. దేశంలో అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన– డిజిటల్ అంశాలపై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత విధాన నిర్ణయాల ద్వారా ప్రజలకు అందుతున్న మెరుగైన పౌరసేవల గురించి ఈ సదస్సులో ప్రస్తావించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా మార్చేందుకు అనుసరిస్తున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎకోసిస్టమ్స్, డేటా సెంటర్లు, క్లీన్, గ్రీన్ ఎనర్జీ, నెక్ట్స్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. పాలనకు సాంకేతికతను జోడించి ఆర్థిక వృద్ధిని ఎలా వేగవంతం చేయవచ్చన్న అంశాలతో పాటు పాలనలో పారదర్శకత, సంపద సృష్టి, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ వంటి వినూత్న అంశాలపై అంతర్జాతీయ ప్రతినిధులతో తన అనుభవాలను ముఖ్యమంత్రి పంచుకోనున్నారు.

# సినిమా న్యూస్



## నుంచి స్పెషల్ వీడియోను పంచుకున్న టీమ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఈరోజు తన 29వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది. కాటుక అక్కర్లేని ఆ కళ్లు, ముక్కుపుడక అక్కర్లేని ఆ ముక్కు.. అంటే అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరియే ఈ చికిరి.. అంటూ దర్శకుడు బుచ్చిబాబు సనా జాన్వీని ప్రశంసిస్తూ ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో జాన్వీ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తుంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సహకారంతో వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 30, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 15 ఏళ్ల అనుబంధం.. బన్నీతో క్యూట్ మూమెంట్స్ షేర్ చేసిన స్నేహా రెడ్డి



టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ , ఆయన భార్య స్నేహా రెడ్డి దంపతులు మార్చి 6 తమ 15వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్నేహా రెడ్డి సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్టు షేర్ చేస్తూ తమ 15 ఏళ్ల అనుబంధంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

"మన ప్రేమతో నిండిన ప్రపంచం, ఇద్దరు పిల్లలు, ఎన్నో తీపి జ్ఞాపకాలు" అంటూ బన్నీకి ధన్యవాదాలు తెలిపారు. దీనికి ప్రతిస్పందించిన అల్లు అర్జున్ కూడా ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

2011 మార్చి 6న వివాహం చేసుకున్న ఈ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2014లో కుమారుడు అయాన్, 2016లో కుమార్తె అర్హ జన్మించారు. అభిమానులు ఈ దంపతులను టాలీవుడ్‌లో అత్యంత క్యూట్ కపుల్‌గా అభినందిస్తున్నారు.

## పెళ్లి తర్వాత భార్యకు భారీ కానుక?.. రష్మికకు విజయ్ గిఫ్ట్‌పై చర్చ



టాలీవుడ్ నటులు విజయ్ దేవేరుకోండ , రష్మిక మందన్న ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో సోషల్ మీడియాలో మరో వార్త చర్చనీయాంశమైంది. పెళ్లి తర్వాత భార్య రష్మికకు విజయ్ దేవరకొండ ఖరీదైన కానుక ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది.

హైదరాబాద్‌లో సకల సౌకర్యాలతో నిర్మించిన లగ్జరీ విల్లాను ఆమెకు గిఫ్ట్‌గా ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ విల్లా విలువ సుమారు రూ.90 కోట్ల వరకు ఉంటుందని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. అయితే ఈ వార్తలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు.

ఇక ఈ జంటకు గీత గోవిందం , డియర్ కామ్రేడ్ చిత్రాల సమయంలో పరిచయం ఏర్పడి, దాదాపు తొమ్మిది సంవత్సరాల పాటు ప్రేమలో ఉన్న తర్వాత వివాహ బంధంతో ఒక్కటైనట్లు సమాచారం. ప్రస్తుతం ఈ గిఫ్ట్ వార్త నెట్టింట వైరల్ అవుతోంది.

## స్ట్రీమింగ్‌కు సిద్ధమైన 'నవాబ్స్ కేఫ్'..

శివ కందుకూరి, తేజు అశ్విని, రాజీవ్ కనకాల ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన సినిమా 'నవాబ్స్ కేఫ్' . చాయ్‌వాలా అనేది ఉప శీర్షిక. ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. ఈనెల 12 నుంచి 'ఈటీవీ విన్' లో స్ట్రీమింగ్ కానుంది. పలు వాస్తవ సంఘటనల ఆధారంగా ఫాదర్- సన్ సెంటిమెంట్‌తో దర్శకుడు ప్రమోద్ హర్ష ఈ చిత్రాన్ని రూపొందించారు. ఫిబ్రవరిలో బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది.



## నాగ్జిల్లాలో ప్రీతి!



గ్లామర్‌కు నటనను జోడించి.. కలువ కళ్లతోనే హావభావాలను పలికించి యువతని విశేషంగా ఆకట్టుకుంటోంది కథానాయిక ప్రీతి ముకుందన్. ఇటీవలే మలయాళ చిత్రం 'సర్వం మాయ'లో తక్కువ స్క్రీన్ టైమ్‌లో మెరిసినా ఈ తార నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులే పడ్డాయి. తాజాగా ప్రీతి హిందీ చిత్రపరిశ్రమలో అడుగుపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్ హీరోగా రూపొందుతున్న 'నాగ్జిల్లా' సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తుందట. ఇప్పటికే ఆమె సినిమాలోని కీలకమైన సన్నివేశాల చిత్రీకరణను పూర్తి చేసిందని, ఇంకా ఏడు రోజులు షూటింగ్ మాత్రమే మిగిలి ఉందని సమాచారం. హారర్ ఫాంటసీ కామెడీగా ఈ సినిమాని మృగ్‌దీప్ సింగ్ లంబా తెరకెక్కిస్తున్నారు. కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్, మహావీర్ జైన్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. "ప్రీతి 'నాగ్జిల్లా'లో నాయిక. ఇందులో పాత్రకు ఆమె సరిగా సరిపోతుందని నిర్మాతలు ఎంపిక చేశారు. కార్తిక్ నాగ్ అనే సర్పం పాత్రను పోషిస్తున్నాడు"అని చిత్రవర్గాలు చెప్పినట్టు సమాచారం. ఈ సినిమా ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## డబ్బులు కాదు.. మంచి కథలే ముఖ్యం



నటుడు శివాజీ హీరోగా నటించిన సాంప్రదాయినీ సుప్పిని సుద్దపూసని చిత్రం ఈరోజు ప్రేక్షకుల ముందుకు రానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా కుటుంబ సమేతంగా చూడదగ్గ భావోద్వేగ కథ అని శివాజీ తెలిపారు.

దాదాపు 20 ఏళ్ల తర్వాత లయతో కలిసి నటించడం ఆనందంగా ఉందని చెప్పారు. భార్యాభర్తల మధ్య ఆలోచనల్లో వచ్చే భేదాలు, మధ్యతరగతి కుటుంబ సమస్యలను ఆసక్తికరంగా చూపించామని అన్నారు.

డబ్బు కోసం కాకుండా మంచి కథల కోసం సినిమాలు చేస్తున్నానని, ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రలు చేయాలనే లక్ష్యమని శివాజీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ఎపిక్ , లెనిన్ , ప్రేమకు నమస్కారం వంటి చిత్రాల్లో నటిస్తున్నారు.

## అడివి శేష్ కోసం రాహుల్ రవీంద్రన్ క్రేజీ స్క్రిప్ట్

టాలీవుడ్ హీరో అడివి శేష్ కు దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఒక వైవిధ్యమైన కథ వినిపించినట్లు సమాచారం. ఆ కథలోని కొత్తదనం శేష్‌ను ఆకట్టుకున్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న కమిట్‌మెంట్స్ కారణంగా ప్రాజెక్ట్‌కు కొంత సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇక శేష్ నటించిన డెకాయిట్ ఏప్రిల్ 10, 2026న విడుదల కానుండగా, స్పై థ్రిల్లర్ గూఢచారి 2 మే 1, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది

